# కీచులాట

"ఈరోజు మనిఆర్డర్ రాకపోతే — నువ్వు మీ ఊరికెళ్ళి రేపటిలోగా వచ్చేసి నా అప్పు తీర్చాల్సిందే" ఖండితంగా చెప్పేశాడు ప్రసాద్.

"అంతే!నా అప్పు కూడా రేపు తీర్చేయాల్సిందే" ప్రసాద్ మాటకు వంత పాడాడు విశ్వం.

"ఈ రోజు తప్పకుండా ఎం.ఓ వస్తుంది" ఎంకదుకలా పీక్కు తింటారు అన్నట్టు చెప్పాడు అనంత్.

"వారం రోజుల్నుంచీ ఇలాగే అంటున్నావ్" కోరస్‌గా అన్నారు. వెంటనే ప్రసాద్ "ఈ రోజు ఎం.ఒ తప్పకుండా వస్తుందని గ్యారెంటీ ఏమిటి?" అన్నాడు. "రాత్రి పోస్టుమన్ కలలో కనిపించాడు" అన్నాడు అనంత్

"మొన్న కలలో ఆత్రేయ కనిపించాడన్నావు...ఉదయం ఆయన మరణ వార్తను పేపర్లో చూశాం... నీకలలో పోస్టుమాన్ కనిపించాడంటే...." మాటను పూర్తిచేయకుండగా ఆపేశాడు విశ్వం. ప్రసాద్ నవ్వాడా మాటలకు.

"ఉదయం పాలపిట్ట కూత వినిపించింది....తెల్లవారు జామున వేపచెట్టుమీద కొంగ కనిపించింది" చెప్పాడు అనంత్.

"అయితే?" ఇద్దరు ఏక కంఠంతో ప్రశ్నించారు అర్థంకాక.

"పిట్ట ఉత్తరానికి సింబల్... కొం. రాయబారానికి ప్రతీక... ఉత్తరం అంటే పోస్టుకు సంబంధించిందే... రాయబారం అంటే ఆ పోస్టు ఎవరో చేసారనీ.... పోస్టు అంటే మనిఆర్డర్ కూడా కావచ్చు" అన్నాడు అనంత్

సింబల్, ప్రతీక పదాలకు అర్థం తెలియలేదు. వాళ్ళిద్దరూ అనంత్‌తోపాటే మొన్ననే కాపీచేసి పదవ తరగతి పాసయ్యారు. ఇప్పుడు జూనియర్ కాలేజీలో ముగ్గురూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ముగ్గురూ ఒక ఊరివారే. వాళ్ళ ఊళ్ళో జూనియర్ కళాశాల లేనందున ఈ ఊరికి చదవడానికి వచ్చారు. ముగ్గురూ కలిసి ఒకగదిని అద్దెకు తీసుకుని ఎవరివంటనువారే చేసుకుని తింటున్నారు.

ఇప్పుడు వీరువుంటున్న ఊరు కొత్త పెద్దది. ఆ ముగ్గురూ కొత్త పల్లెటూరి వాతావరణం నుంచి రావడం వల్ల సినిమాలకి, షికార్లకు, హోటల్లోని చిరుతిళ్ళకు దుబారాగా ఖర్చుపెట్టారు. అందరికంటే అనంత్ దగ్గరవున్న డబ్బుముందుగా ఖర్చు అయిపోయింది. అందుకని ప్రసాద్ దగ్గర ఇరవై రూపాయలు, విశ్వం దగ్గర ముప్పయి రూపాయలు అప్పు చేశాడు.

అప్పు ఇచ్చేప్పుడు మీ నాన్న పరమపిసినారి కదా... నువ్వు డబ్బు దుబారాగా ఖర్చు పెడుతున్నావని తెలిస్తే ఊరికే వుంటాడా? మరినీవు నా అప్పు తీర్చకుంటే నేనేం



-ఎమ్మెస్రాజ్

చేయాలి?'' అని అడిగాడు ప్రసాద్.

''మా నాన్న పిసినారి ఏమీకాదు... నేను చెడిపోతానని ఇంతకుముందు డబ్బు ఇచ్చేవాడు కాదు... ఇప్పుడ నేను పెరిగి పెద్దవాణ్ణయి పెద్ద చదువులు చదువుతున్నాను కాబట్టి ప్రతి పైసా ఆలోచించి ఖర్చు పెట్టే తెలివి వుందని నాన్నగారికి' తెలిసిపోయింది. మా నాన్నగారుమనసున్న మనిషి.... నిన్ననే ఎం.ఓ చేయమని ఉత్తరం రాసాను. నీ బాకీ తప్పకుండా తీరుస్తాను... అంత నమ్మకం లేకుంటే... నా బియ్యం చౌకధరకు నీకు అమ్మేస్తాను సరేనా!'' అని అభయమిచ్చాడు. వారం రోజుల్లో నీ బాకీ తీర్చకుంటే నా కిరోసిన్ స్టౌ నీ స్వంతం చేసుకో... కావాలంటే కాగితం రాసిస్తాను'' అంటూ విశ్వం దగ్గర ముప్పయి రూపాయలు బాకీ చేశాడు.

ముగ్గురూ మని ఆర్డర్‌కోసం రోజూ ఎదురు చూస్తున్నారు. ఎం.ఓ రాకపోవడంవల్ల ''మీ నాన్నగారికి ఉత్తరంలో ఏం రాశావు? మనిఆర్డర్ చేయమని మాత్రమే రాశావా?'' అని అడిగాడు ప్రసాద్.

''ఏం కారణం చూపించావ్?'' అడిగాడు విశ్వం.

''నా నోరు పగిలింది... నాలుక ఎర్రగా మారింది... ఉప్పు కారం తగలనీడం లేదు... అన్నం సహించడంలేదు... డాక్టరుగారికి చూపించాను.. వంద రూపాయలు ఖర్చవుతాయనిచెప్పారు. మందులకు వంద పోనూ మిగాతా ఖర్చులకు ఏభై రూపాయలు ఎక్కువ పంపమనిరాశాను'' అన్నాడు అనంత్.

''భలే ఉపాయం ఆలోచించావే!'' ఆశ్చర్యంగా అన్నాడు ప్రసాద్.

''మరేమనుకున్నావ్ అనంత్ అంటే... మంచి నాలెడ్జీ ఉంది కాబట్టే కథలు, కవితలు రాస్తాడు'' అన్నాడు విశ్వం (అనంత్ కథలు, కవితలు రాసే ప్రయత్నం మాత్రం చేస్తున్నాడు అంతే)

''ఉత్తరం ఎప్పుడు రాశావ్! అడిగాడు ప్రసాద్.


''మొన్న... అంటే... పధ్నాలుగో తేదీన''

''అంటే ఆ ఉత్తరం పదహారో తేదీన చేరుంటుంది'' అన్నాడు విశ్వం.

''పదిహేడో తేదీన ఎం.ఓ చేసినా మొన్ననే మనకు చేరేది'' అన్నాడు ప్రసాద్.

''ఎం.ఓ అయితే రెండు రోజులు ఎక్కువ ఆలస్యం అవుతుంది'' చెప్పాడు అనంత్.

''నిన్నటికే రెండురోజులెక్కువైందిగా'' అడిగాడు విశ్వం.



''అబ్బో, నాకామాత్రం తెలివిలేదా! త్వరగా పంపేందుకు బలమైన కారణం చూపించాను'' అన్నాడు అనంత్

''అందుకే ఈరోజు తప్పకుండా వస్తుంది'' హుషారుగా అన్నాడు అనంత్.

కాలేజీలో ఎలక్షన్లు జరుగుతున్నాయి కాబట్టి ముగ్గురూ కాలేజీకి వెళ్ళకుండా ఎం.ఓ కోసం రూమ్ బయట కూర్చుని ఎదురుచూస్తున్నారు. పోస్టాఫీసుకే వెళ్ళాలను కున్నారు. కానీ, అక్కడ కొత్తమొఖాలకు పోస్టుమాన్ డబ్బు ఇవ్వడేమోనని వెళ్ళలేదు.

''ఈరోజు మనిఆర్డర్ రాకపోతే... నా ఇరవై రూపాయలకుగాను నీ మాట ప్రకారమే ఇరవై కిలోల బియ్యం ఇవ్వాలి'' అన్నాడు ప్రసాద్.

''అమ్మో చౌక అంటే మరీ అంత చౌకనా? అవి సోనా మసూరి బియ్యం''

''ఏ బియ్యం అయితే నాకేం?''

''ఈ రోజు ఎం.ఓ రాకపోతే నా ముప్పయి రూపాయల బాకీకిగాను నీ వంద రూపాయల స్టౌ నాకివ్వాల్సిందే'' ఇదే సమయం అన్నట్టుగా అన్నాడు విశ్వం.

''నేనేమీ ఎగ్గొట్టడంలేదుగా... మీరన్నట్టు ఇవాళ ఎం.ఓ రాకపోతే నేనే స్వయంగా ఊరెళ్ళిడబ్బు పట్టుకొచ్చి రేపిస్తా సరేనా'' అంటూ ఇక రేపటివరకు ఏమీ మాట్లాడకండి అన్నట్టుగా చూశాడు వాళ్ళవైపు అనంత్.

''నువ్వు ఉత్తరం సరిగ్గా రాసావో లేదో — నీరాత మా నాన్నగారికి సరిగ్గా అర్థమైందో లేదో కోతి రాతా నువ్వూను'' అనుమానాన్ని వ్యక్తం చేసాడు ప్రసాద్.

''ఒరేయ్ మరియాదగా మాట్లాడు. నా చేతిరాత నీ చేతిరాతకన్నా బాగుంటుందన్న విషయం గుర్తుంచుకో. నీకు తెలుగులో ముప్పయ్యారు మార్కులే వచ్చాయి. మరినాకో... ముప్పయి ఎనిమిదొచ్చాయి. ఉత్తరాలు రాయడం ఏంఖర్మ ఊళ్ళో మానాన్నగారు వడ్డీకిచ్చే బాపతు పత్రాలన్నీ నేనే రాస్తుండేవాణ్ణి తెలుసా?''

''ఏదో మాటవరసకి అంటే అంత కోపమెందుకురా నాయనా!'' కోపాన్ని తగ్గించుకో అన్నట్టు అన్నాడు విశ్వం.

రెండేరెండు క్షణాలు మౌనంగా గడిచాయి.

''నీకు నూటయాభై రూపాయలొస్తాయి కదా! మా బాకీపోనూ నీ దగ్గర ఇంకా వందరూపాయలుంటాయి కదా! ఏం చేస్తావ్?'' తెలుసుకోవాలన్నట్టు అడిగాడు ప్రసాద్.

''ఎవరికైనా వడ్డీకిచ్చి... ఆ వచ్చిన వడ్డీతో

అవసరాలు తీర్చుకుంటాను''

''వంద రూపాయలకెంత వడ్డీ వస్తుందోయ్?'' అడిగాడు ప్రసాద్.

''ఎంతొచ్చినా నెల తర్వాతేకదా! అంతవరకు ఎలా గడుపుతావ్?'' విశ్వం.

''వడ్డీ ముందుగానే మినహాయించుకునేకదా ఇస్తాను''

ప్రసాద్, విశ్వం తెల్లమొహం వేసారు. వెంటనే ప్రసాద్ తేరుకుని ''వడ్డీ ఏ రేటుకిస్తావ్?'' అన్నాడు.

''పాతిక'' అన్నాడు అనంత్.

''పాతికా? నూటికి?? నెల ఒక్కంటికి'' మహాశ్చర్యంగా అడిగాడు విశ్వం.

''అలా నోరు తెరుస్తావేంటి? ఈ వూళ్ళో నూటికి ముప్ఫయ్ రూపాయలు వడ్డీ ఇస్తామన్నా అప్పు దొరకనివాళ్ళు బోలెడుమందున్నారు'' ఆ విషయాన్ని ఎప్పుడో కనిపెట్టినట్టు చెప్పాడు అనంత్.

''నీకు చదువెందుకురా! మహరాజులా వడ్డీవ్యాపారం చేసుకుని బ్రతక్కా?'' ప్రసాద్ ప్రశ్నించాడు.

''ఈ వ్యాపారంలోకూడా మొండి తగాదాలుంటాయి. కోర్టుదాకా తీసికెళ్ళాల్సిన కేసులు కొన్నుంటాయి. ఆ కేసులకోసం వకీళ్ళకు వేలకొద్దీ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. వేరే లాయర్లకు తినిపించడమెందుకు! ఆ లాయర్ చదువేదో నేనే చదివితే బోలెడు డబ్బు మిగుల్తుంది కదా అని చదువుతున్నాను''.

అనంత్ అలా మాట్లాడాక ప్రసాద్, విశ్వం ఏం మాట్లాడలేకపోయారు. గుడ్లప్పగించి నిర్నిమేషంగా అనంత్‌ను చూడ్డమే సరిపోయింది.

''చాలా తెలివైనవాడేరోయ్'' ప్రసాద్ విశ్వంతో అన్నాడు.

''కాబోయే రచయిత... కవి... మరి తెలివి లేకుంటే ఎలా?'' అని మాత్రం అన్నాడు విశ్వం మెల్లగా.

''అదో! అదో!! పుల్లన్న వస్తున్నాడు'' సంతోషంగా అరిచాడు అనంత్. ప్రసాద్, విశ్వం వీధివైపు చూశారు. పోస్టుమెన్ పేరు పుల్లన్న అయివుండవచ్చని పోస్టుమెన్‌కోసం వీధిలో గాలించారు (చూపుల్తో).

''ఎక్కడరా?'' అడిగాడు ప్రసాద్.

''అదిగో...'' వేలుపెట్టి చూపించాడు అనంత్.

''అరే! మనవూరి పుల్లన్ననా?'' ఆ మాత్రానికి ఎందుకు సంతోషించాలా అన్నట్టు పలికాడు ప్రసాద్.

## పొరపాటు

''డాక్టర్‌గారున్నారా? పాము కరించింది. మహా బాధగా వుంది'' అన్నాడో వ్యక్తి హాస్పిటల్‌కు వచ్చి.

''డాక్టర్‌గారినే పాము కరించింది. అందుకే పక్కవూళ్ళో మాంత్రికుడి దగ్గరకెళ్ళారు'' అన్నాడు కాంపౌండర్.

''అయ్యో ఎంత అనర్థం జరిగింది?!

''అదేం?''

''ఆ మాంత్రికుణ్ణి నేనేనయ్యా బాబూ....!!''

జనార్దన్

''మా నాన్నగారు మనిఆర్డర్ చేస్తే కమిషన్ తగుల్తుందని పుల్లన్నద్వారా డబ్బుపంపి ఉంటాడు. అదిగో పుల్లన్న మన రూం కోసమే వెదుకుతున్నట్టుంది'' మరీ సంతోషంతో చెప్పాడు అనంత్.

''వెధవ తెలివి నువ్వూను. నూటయాభై రూపాయలు ఎం.ఓ చేయడానికి అయిదు రూపాయలు కమిషన్ అవుతుంది. పుల్లన్న వెంబడి పంపిస్తే రానుపోనూ బస్సు కిరాయిలకే పదహారు రూపాయలు ఖర్చవుతాయి తెలుసా?'' అన్నాడు విశ్వం. అనంత్ ఏమీ మాట్లాడలేదు. పుల్లన్న నేరుగా తమవైపే వస్తుండడం చూసి లేచి నిలబడ్డారు ముగ్గురూ. అతని చొక్కా జేబు ఉబ్బెత్తుగా ఉండడం దూరాన్నుంచే ముగ్గురూ గ్రహించారు. అనంత్ తండ్రిగారు డబ్బు పంపించినట్టు ఊహించుకున్నారు.

పుల్లన్నకు ఏభై ఏళ్ళుంటాయి. మనిషి పేదవాడేకానీ, చూడ్డానికి పహిల్వాన్ నెల్లూరి కాంతారావులా ఉంటాడు. మనిషి మరి కాస్త నల్లగా, మొరటుగా వుంటాడు. వ్యవసాయ కూలీగా అప్పుడప్పుడూ పనిచేస్తున్నా ఎక్కువ వరకూ చెట్లను నరికి వంట చెరుకుగా తయారుచేస్తుంటాడు కూలీకి. పొట్టేలు కొమ్ముల్లాగా పుల్లన్న మీసాలు వంపుతిరిగి ఉంటాయి.

''ఏం పుల్లన్నా? ఎక్కడికో వచ్చావ్?'' ఎదురుకున్నట్టు ముగ్గురూ ఒకేసారి అడిగారు. పుల్లన్న అనంత్ వేపు చూసి ''మీ నాయిన పంపిందు మల్ల'' అన్నాడు.

అందరి మొహాల్లో ఒక్క వెలుగు వెలిగాయి. ''రా! రా!! లోపలికి రా!'' ముగ్గురూ పుల్లన్నను గదిలోకి తీసికెళ్ళారు. తొందరపడి డబ్బు పంపించాడా అని అడగడం బావుండదనిపించింది. పుల్లన్న గదిలో ఓమూలకు కూర్చుని గదంతా కలియజూసి ''ఈ కొంప బాడిగెంత?'' అని అడిగాడు.

''తొంభై రూపాయలు. మనిషికి ముప్పై తగుల్తవి'' అన్నాడు ప్రసాద్.

''అరేయ్ పుల్లన్న ఊరి దగ్గర ఎప్పుడు భోంచేసాడో ఏమో మనవూరి మనిషి మనింటికి వస్తే మరియాద చేయకుంటే ఏం బాగుంటుంది!'' అన్నాడు విశ్వం.

''లే! పుల్లన్నా లే! కాళ్ళు కడుక్కో'' అన్నాడు అనంత్.

ప్రసాద్ చెంబుతో నీళ్ళు అందించాడు.

విశ్వం విస్తరి పరిచాడు.

అనంత్ తాను వండుకున్న అన్నాన్ని విస్తరిలో వడ్డించాడు.

పుల్లన్న కాళ్ళూ చేతులూ కడుక్కొని వచ్చి విస్తరిముందు కూర్చున్నాడు.

''మా ముగ్గురికీ పచ్చిపులుసు చేయడం తప్ప వేరే వంట రాదు. నిన్నామొన్నా పచ్చిపులుసు తిని మొహం కొట్టింది. అందుకనీ ఈరోజు పచ్చిపులుసు చేసుకోలేదు. ఊర్నుంచి తెచ్చుకున్న నిమ్మకాయ చట్నీ వుంది. చింతకాయ చట్నీవుంది. ఉసిరికాయ చట్నీవుంది. మామిడికాయ చట్నీవుంది. నీకేది ఇష్టమో చెబితే...'' అనంత్ మాటను పూర్తికానీయకముందే ''నేనేం దొర కొడుకునా సామీ! పచ్చిమిరపకాయలు నూరుకుని కూడుపక్కన నంజుకుని తినేటోన్ని. నాకు అన్ని సెట్నీలు ఇట్టమే'' అన్నాడు పుల్లన్న లొట్టలేస్తూ.

అనంత్ తనవంతు నిమ్మకాయ చట్నీ వేశాడు. నిమ్మకాయ చట్నీని కలుపుకుని అన్నాన్నంతా రెండు ముద్దల్లో తిని విస్తరాకును ఖాళీచేసాడు పుల్లన్న. పుల్లన్నకు ఆ అన్నం చిన్నపేగుకు కూడా సరిపోలేదని తెలిసిన ప్రసాద్ తను వండుకున్న అన్నాన్ని పూర్తిగా వడ్డించి చింతకాయ చట్నీ వేశాడు.

పోపు పెట్టిన చింతకాయ పచ్చడి (ఊరగాయ) ఎంతో రుచిగా అనిపించడంతో విస్తరాకును కడిగినట్టు శుభ్రం చేశాడు పుల్లన్న.

మరియాద కోసం 'అన్నం వడ్డించమంటారా?' అని అడిగాడు విశ్వం. వద్దంటాడనుకున్నాడు. తనవంతు అన్నాన్ని ముగ్గురూ కలిసి తినవచ్చని ఇంతవరకు ఆశపడ్డాడు విశ్వం.

''కొంచెం పెట్టండయ్యా'' చేతిని నాక్కుంటూ అన్నాడు పుల్లన్న. అలా నాకుతున్నప్పుడు చేతికి వున్న ఎంగిలి మీసాలకు అంటుకుంది. విధిలేదన్నట్టు విశ్వం తను వండుకున్న అన్నాన్ని వడ్డించి ఉసిరికాయ చట్నీ వేశాడు.

పుల్లన్న ఆ అన్నాన్ని కూడా ఒక్క మెతుకు మిగల్చకుండా తినేశాడు. మరికాస్త పెడతారే

మోనని ఎదురుచూశాడు. ముగ్గురి గిన్నెలు ఖాళీ అయినట్టు కళ్ళముందే కనిపించడంతో అంతకంటే ఎక్కువ తినలేనన్నట్లు దొంగ త్రేన్పు తేన్చాడు.

పుల్లన్న ఎంగిలి విస్తర్ని తీసుకుని బయటికి వెళ్ళాక ''మనం ఇక అన్నం వండుకుందామా'' అన్నాడు ప్రసాద్ విశ్వంతో. ''పుల్లిగాడు పోయింతర్వాత వండుకుందాంలే... లేకపోతే మక్కీ తినగలడు'' అన్నాడు.

పుల్లన్న విస్తరి పారేసి ఇంట్లోకి వచ్చాక ''కాల్చడానికి బీడీలున్నాయా? తెప్పించమంటావా?'' అడిగాడు అనంత్ ఉన్నాయంటాడనుకుని.

''తమరి దయ దొరా!'' తలగోక్కున్నాడు పుల్లన్న.

''అట్లా అడగకూడదు బే! మనం పెద్దమనుషులకు మరియాద చేసేప్పుడు అడగకుండా చెయ్యాలె'' మరియాద గురించి తనకు బాగా తెలుసన్నట్టు అడిగాడు ప్రసాద్.

''ఓ పావలా వుంటే ఇవ్వరా బీడీలకు'' అడిగాడు అనంత్ విశ్వాన్ని.

''నా దగ్గర లేవుకదా! ఇంతకూ పుల్లన్న ఏం పనిమీద ఈ ఊరొచ్చిండో కనుక్కుందాం'' అన్నాడు విశ్వం అనంత్‌తో.

''మా కోడలుది ఈ ఊరేకదా దొరా! మొన్న నాగుల్చవితికి వచ్చింది. తోలుకపోదామని వచ్చిన'' అన్నాడు పుల్లన్న.

ముగ్గురికీ గుండెల్లో రాయి పడ్డట్టనిపించింది. అనంత్ తేరుకుని ''ఇందాకా మా నాన్నగారు పంపారన్నావ్?'' అని అడిగాడు.

''ఆ... నేను వొత్తుంటే ఎట్లాగూ నువ్వు నీ కోడలి దగ్గరకు పోతుండవు కదా గాంధీతాత సౌరస్తా దగ్గర రంగారెడ్డి కంపోండుల నా కొడుకు కిరాయికుంటడు ఈ వుత్తరం... ఈ పొట్లం నీకియ్యమని చెప్పిండు'' అని జేబులోంచి మడతలుగా వున్న కాగితాన్ని, మరో చిన్న పొట్లాన్ని తీసిచ్చాడు పుల్లన్న.

విశ్వం పొట్లాన్ని అందుకుని విప్పిచూశాడు. చిటికెడన్ని గసగసాలు అగుపించాయి. వాటిని చూశాకా ఏమీ అర్థంకాలేదు. పొరపాటున పుల్లన్న ఒక పొట్లం బదులు మరొక పొట్లం ఇచ్చాడేమోనని సందేహించాడు.

''ఏం రాశాడో త్వరగా చదవరా!'' తొందర చేశాడు ప్రసాద్. పుల్లన్న వెంట డబ్బు పంపిన విషయం ఏమైనా తెలుస్తుందని.

అనంత్ అందరికీ వినపడేలా చదవడం మొదలుపెట్టాడు.

''చిరంజీవి అనంతరావుకు— మీ అయ్య ఆశీర్వదించి వ్రాయులేఖ. నీవు రాసిన ఉత్తరం



''కొన్ని నెలలుగా మా ఆయన సాయంత్రం పూట ఎక్కడ గడుపుతున్నాడో తెలుసుకోలేక పోయాను'' చెప్పింది క్లబ్బు సెక్రటరీ శచీదేవి.

''అయితే? ఆ తర్వాత ఏమయింది?'' ఆసక్తిగా అడిగింది జాయింట్ సెక్రటరీ జాంబవతి

''ఓ సాయంత్రం పేకాట ఆడకుండా ఇంటికి వెళ్ళిపోయాను. ఆయన ఇంటిదగ్గరే వున్నారు'' నవ్వెన్ను విప్పేసింది శచీదేవి

హిమజారమణ

ముట్టినది. ఉత్తరం చదివాక చాలా బాధకలిగింది. రాత్రంతా నిద్రపోలేదు. మీ అమ్మకూడా నిద్రపోలేదు.

''మేము ఇక్కడ పైసాపైసా కూడబెట్టి డబ్బు సంపాదిస్తుంటే — నువ్వు ఏకంగా ఒక్కసారే పదహైదు పైసలు ఖర్చుచేసి ఉత్తరం రాస్తే నాకు ఎంత బాధ అనిపించివుంటుందో నువ్వే ఊహించుకో బాబూ!

''నువ్వు వయసులో పెద్దవాడివవుతున్నావు. ప్రతి పైసా ఆచితూచి ఖర్చుబెట్టడం నేర్చుకుని నా కుమారుడవని నిరూపించు. నీకు ఉత్తరం రాయాలనిపిస్తే ఒక తెల్లకాగితమ్మీద రాసి బస్టాండుకు వచ్చి మన ఊరికి వచ్చేవాళ్ళకి ఎవరికైనా ఆ కాగితం ఇస్తే సరి. నాకు ముదుతుంది.

''ఉపాయం బాగుందికదా అని ఎప్పుడుబడితే అప్పుడు ఉత్తరం రాసి పంపించకు. కాగితాలు, సిరా వృధాగా అయిపోతాయి. అత్యవసరముకున్నప్పుడే ఉత్తరం రాసి పంపించు.

''ఇంకపోతే నువ్వు కాలేజీలో చేరి ఇంకా ఒక్క నెలకూడా పూర్తి కాలేదు. పుస్తకాలు కొనిచ్చాను. ఫీజు కట్టాను. రూంకిరాయి కూడా మనవాటా చెల్లించినాము. వంటకు కావలసిన సామానులన్నీ ఇప్పించినాను. నీ ఖర్చులకని నలభై రూపాయలుకూడా ఇచ్చినాను కదా! అవన్నీ ఎలా ఖర్చుపెట్టావో లెక్కరాసి నాకు చూపించగలవు. లెక్క నాకు నచ్చితే మళ్ళీ నీ ఖర్చుకు డబ్బు పంపిస్తాను.

''నాలుక, నోరు పగిలినాయని తెలిపినావు. డాక్టర్లకు చూపించుకోవద్దు. డాక్టర్లు మందుల షాపులవాళ్ళని బలిపించడానికి పనికిరాని మందులు రాస్తారు. మందుల షాపులవాళ్ళు డాక్టర్లకు కమిషన్‌కూడా ఇస్తారంట.''

పుల్లన్నవెంబడి గసగసాలను మీ అమ్మచేత పెన్నంమీద వేయించి పంపిస్తున్నాను. ఈ గసగసాలను మూడు పూటల నాలుకపై వేసుకుని చప్పరించగలవు. తొందరగా నోటి జబ్బులు పోతాయి.

''నీ బియ్యం, కిర్సనాయిల్, ఊరగాయపచ్చటి సీసాను జాగ్రత్తగా భద్రపరచుకొనగలవు. బుద్ధిగా చదువుకో... మీ అయ్య భద్రయ్య''

ముగ్గురూ నీరుకారిపోయారు.

''తమరి నోరు బాగానే వుందికదా'' అన్నాడు పుల్లన్న అనంత్‌ను చూస్తూ.

అనంత్ వెంటనే పుల్లన్న కాళ్ళమీద పడ్డాడు. ''నేను సర్కారు దవాఖాన్లో మందులు వాడానుకానీ, మా నాన్నగారి దగ్గర మాత్రం ఇక్కడ మేము నీకు భోజనం పెట్టినట్టు మాత్రం చెప్పొద్దు'' అన్నాడు.

''భలేవారే! నానెందుకు చెబుతాను. మీ అయ్య సంగతి నాకు తెల్వదామల్ల. బీడీలకు ఓ రూపాయుంటే పారేయి'' అన్నాడు. వచ్చినట్టు ఇస్తాడని తెలిసిపోయింది పుల్లన్నకు.

''అరేయ్ ప్రసాద్! ఇంకొక్క రూపాయి ఇవ్వరా ఇరవై ఒక్క రూపాయి అవుతుంది'' ఇంచుమించు ఏడుస్తున్నట్టుగా అడిగాడు అనంత్.

''నా దగ్గరెక్కడివిరా! నాకు ఒక్కపొట్లం కొనేందుక్కూడా అయిదు పైసల్లేకుండా చేసావు. ముందు నా బాకీ సంగతేమిటో తేల్చు'' అన్నాడు ప్రసాద్.

''నా బాకీ సంగతేమిటి?'' వెంటనే అన్నాడు విశ్వం.

అనంత్ కళ్ళల్లో నీళ్ళు నిండుకున్నాయి.

''నా బాకీ ఇరవై అయిదు రూపాయలు'' లెక్క చెప్పాడు ప్రసాద్.

''ఇరవయ్యేకదా!'' దుఃఖాన్ని ఆపుకుంటూ అన్నాడు అనంత్.

''ఇప్పుడు పుల్లన్నకు అన్నం పెట్టానుకదా అన్నం ఉచితంగా వచ్చిందా?''

''నా బాకీకూడా ముప్పయి అయిదు రూపాయలు'' అన్నాడు విశ్వం.

విశ్వంకూడా పుల్లన్నకు తనవంతు అన్నం పెట్టాడుకాబట్టి ఎలా అని అడగలేదు అనంత్.

''మరియాదగా నాకు బియ్యం అమ్మేసేయ్''

''నాకు కిరోసిన్ స్టవ్ ఇచ్చేసేయ్''

పుల్లన్న అక్కడినుంచి జారుకున్నాడు మెల్లగా.

ముగ్గురూ ఇంకా గదిలో కీచులాడుకుంటూనే ఉన్నారు.